


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

## రైతులను ఇబ్బంది పెడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

- ఏఈఓ సర్టిఫై చేసినా తరుగు పేరుతో కోతలు పెడుతున్నరు
- దానిని నివారించకపోతే ప్రభుత్వ లక్ష్యం నీరుగారే అవకాశం
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబర్ 28: వానకాలం సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతుంటే నాణ్యత సాకుతో కొంత మంది మిల్లర్లు కోతలు పెడుతున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి సివిల్ సప్లై అధికారులకు సూచించారు. శనివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో 1నుంచి 7 వరకు స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దాన్యం కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు నాణ్యతను ధృవీకరించిన తర్వాతే తూకం వేసి మిల్లులకు తరలిస్తే నాణ్యత పేరుతో క్వింటాకు రెండు నుంచి ఐదు కిలోల వరకు కోతలు పెడుతున్నట్లు తెలిపారు. ఆయా మిల్లులను గుర్తించి వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నోటీసులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుంటే.. మిల్లర్ల కారణంగా ఆ లక్ష్యం నీరుగారే అవకాశం ఉందన్నారు. సీఎమ్మార్ విషయంలోనూ పూర్తి స్థాయిలో ఎప్పటికప్పుడే ధాన్యం సేకరించాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించటంతో పాటు ఎప్పటికప్పుడు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన మన ఊరు–మన బడి పనులు పెండింగ్‌లో ఉంచకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి పాఠశాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంతో పాటు వారానికి ఒక సారి గ్రామాల్లో ఉన్న ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు పూర్తిగా బంద్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ట్రాక్టర్లకు ఫుల్ వీల్స్ వేసుకొని వెళ్లడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, ఈ విషయమై ఆయా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని ఆర్టీఓ యంత్రాంగాన్ని కోరారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, స్థాయీ సంఘం చైర్మన్ నారబోయిన స్వరూపారాణి, జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని 60 గొర్రెలు మృతి

నందికొండ, అక్టోబర్ 28 : టిప్పర్ అదుపు తప్పి గొర్రెల మంద పైనుంచి దూసుకు పోవడంతో 60 గొర్రెలు మృతి చెందిన ఘటన నందికొండలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పనులకు అవసరమైన రాతిపొడిని మాచర్ల నుంచి హాలియాకు తరలిస్తున్న టిప్పర్ స్థానిక హిల్‌కాలనీలోని దయ్యాల గండి సమీపంలో అదపు తప్పి ఎదురుగా వస్తున్న గొర్రెల మంద మీదికి దూసుకెళ్లింది. దాంతో ఆగకుండా కారు, అంబులెన్స్, బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమారు 60 గొర్రెలు మృతి చెందాయి. ఎవరికీ ప్రాణాపాయం జరుగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి ఎస్ఐ తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

మోత్కూరు, అక్టోబర్ 28 : ధాన్యం అమ్మకాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారి పి.యాదయ్య అన్నారు. శనివారం మోత్కూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలు సజావుగా నడిచేలా సంబంధిత మండల అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అంతకుక్రితం మండలంలోని ముశిపట్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, ఏఓ స్వప్న, ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ చీకటే

- బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంత్రి జగదీశ్‌రెడ్డి




బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబర్ 28 : పద్నాలుగేండ్లు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని.. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోతలతో చీకట్లో ఉన్న రాష్ట్రాన్ని నిరంతర వెలుగులోకి తీసుకొచ్చారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంలో మళ్లీ చీకట్లు అలుముకుంటాయన్నారు. శనివారం పట్టణంలో సాయిరమ్య ఫంక్షన్‌హాల్లో జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత నాలుగేండ్లుగా కనిపించని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు వచ్చి పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని, వారిని తిరస్కరించాలని కోరారు. తెలంగాణ పోరాటంలో ప్రజల సమస్యలను గుర్తించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటి ఐదేండ్లు సంక్షేమ పథకాలు అందిస్తూ దేశంలోనే అన్ని రాష్ట్రాలు అబ్బుర పడేలా తెలంగాణను తీర్చి దిద్దారన్నారు. కరోనా సమయంలో పేద ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని కాంగ్రెస్ నాయకులకు ఓట్ల ముందు ప్రజలు గుర్తుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. కర్ణాటకలో ఎన్నికల ముందు 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేశాక చేతులెత్తేసిందని, ప్రస్తుతం 2 గంటలు కూడా సక్రమంగా ఇస్తలేరని రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నారని మంత్రి అన్నారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు ఇస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ తమ పాలనలో ఉన్న కర్ణాటక, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి ప్రశ్నించారు. ప్రధాని మోదీ పుణ్యమాని రూ.500 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200కు చేరిందన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టగానే రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. రైతుబంధును రూ.15వేలకు పెంచుతామన్నారు. రాష్ట్రంలో 1000 గురుకుల పాఠశాలల ద్వారా ప్రతి పేద వాడికి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని మంత్రి చెప్పారు. ఎలాంటి ఆధారం లేని మహిళలకు రూ.3వేలు, ఆసరా పింఛన్‌ను రూ.5వేలకు పెంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.1,0116 అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల డబ్బులు నాయకుల జేబుల్లోకి వెళ్తాయని, అదే సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం చేపడితే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వ్యాపారాలు, కాంట్రాక్టులు లేవని, ఆయన కేవలం ప్రజా సేవకే పరిమితమయ్యారన్నారు. ఎల్లప్పుడూ ప్రజల కోసం పనిచేసే నాయకుడు రవీంద్రకుమార్‌ను 50 వేల మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

### ప్రాజెక్టులు పూర్తయితే 1.60 లక్షల ఎకరాలకు నీరు : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ రూ.6,349 కోట్లతో డిండి ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మరో రూ.600 కోట్లతో ఐదు లిఫ్ట్‌ల పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలో 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పట్టణంలో రూ.100 కోట్ల నిధులతో రహదారులు, అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ప్రతి ఆవాసంలో గ్రామపంచాయతీ భవనాలు నిర్మించి పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31న జరిగే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రానున్నారని, నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. నాలుగేండ్లు నియోజకవర్గంలో కనిపించని కాంగ్రెస్ నాయకులు, బ్యాంకులు దోచుకున్న వ్యక్తులు ఎన్నికలు రాగానే మళ్లీ ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తున్నారని, వారికి ఎందుకు ఓటు వేయాలో ప్రశ్నించాలని సూచించారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రజలు తిరస్కరించినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కేతావత్ బిల్యానాయక్, ఎంపీపీలు మాధవరం సునీతాజనార్దన్‌రావు, వంగాల ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్‌రెడ్డి, ముత్యాల సర్వయ్య, లోకసాని తిరుపతయ్య, రాజీనేని వెంకటేశ్వర్‌రావు, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు పల్లా ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, భగవంత్‌రావు, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్‌గౌడ్, జడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, వైస్ చైర్మన్ రహత్‌అలీ, కౌన్సిలర్లు రైస్, ఇలియాస్, తౌఫిక్, చిత్రం ప్రదీప్ పాల్గొన్నారు.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

### హోమంలో పాల్గొన్న మంత్రి

దేవరకొండ పట్టణంలో మాజీ ఎంపీపీ ఏడ్పుల రమాదేవీగోవింద్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన హోమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్ ఉన్నారు.

# నేడే సూర్యాపేట జిల్లాకు సీఎం కేసీఆర్ రాక

- సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కిశోర్, ఎస్పీ రాహుల్ హెగ్డే

తిరుమలగిరి, అక్టోబర్ 28 : బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం తిరుమలగిరికి రానున్నారు. మండల కేంద్రంలోని సూర్యాపేట రోడ్డులో నిర్వహించే తుంగతుర్తి సమర శంఖారావం సభకు సీఎం హాజరై ప్రసంగించనున్నారు. సభా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నియోజక వర్గం నుంచి వేలాది మంది సభకు తరలి రానున్నారు. సీఎం కేసీఆర్ హెలికాఫ్టర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నేరుగా సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాట్లు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం సభలో ప్రసంగిస్తారు. వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. 60 వేల మందికి పైగా జనం సభకు తరలి రానున్నట్లు బీఆర్‌ఎస్ శ్రేణులు తెలిపాయి.

### నియోజకవర్గం గులాబీ మయం..

తుంగుతుర్తి నియోజక వర్గంలోని 9 మండలాలు సీఎం కేసీఆర్ రాక సందర్భంగా గులాబీమయమయ్యాయి. అడుగడుగునా గులాబి దళపతి కొటౌట్లు ఏర్పాటు చేశారు. ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు సభకు భారీగా తరలి వచ్చేలా గ్రామాల్లో ముమ్మర ప్రచారం సాగింది. సీఎం రాకతో నియోజక వర్గానికి మరింత మేలు జరుగుతదని ప్రజలు భావిస్తున్నారు. వెనుకబడిన తుంగతుర్తి ప్రాంతం బీఆర్‌ఎస్ పాలనలో ఊహలకు అందని రీతిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్, ఎమ్మెల్యేగా గాదరి కిశోర్‌కుమార్ గెలిస్తే నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

### పార్కింగ్ స్థలాలు..

సీఎం కేసీఆర్ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి వచ్చే వాహనాలకు మూడు మార్గాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. మోత్కూర్, అడ్డగూడూరు, శాలీగౌరారం మండలాల నుంచి వచ్చే వాహనాలు కూరగాయల సంతలో, నాగారం, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల మండలాల నుంచి వచ్చే వాహనాలకు సూర్యాపేట రోడ్డులోని ఇమ్మడి నర్సయ్య ఎస్టేట్‌లో, తిరుమలగిరి మండంలోని జలాల్‌పురం, మామిడాల, గుండెపురి, వెలిశాల, బండ్లపల్లి, మాలీపురం తదితర గ్రామాల నుంచి వచ్చే వాహనాలు తొర్రూర్ రోడ్డులోని వెంచర్‌లో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు.

### భారీ బందోబస్తు..

సీఎం కేసీఆర్ సభకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రాహుల్ హెగ్డే భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ స్థలాలను పర్యవేక్షించారు. వాహనాల మళ్లింపు, పార్కింగ్ స్థలాల వద్ద వాహనాల నిలిపివేత వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఐదుగురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 42 మంది ఇన్‌స్పెక్టర్లు, 400 మంది సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర బలగాల సిబ్బందికి తిరుమలగిరి పాల్‌టెక్నిక్ కళాశాల యందు వసతి ఏర్పాటు చేయగా వసతి సదుపాయాలను ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ నాగభూషణం, సీఐ శివశంకర్, ఎస్ఐ ప్రసాద్, సైదులు పాల్గొన్నారు.

### కోదాడకు సీఎం కేసీఆర్

కోదాడ, అక్టోబర్ 28 : కోదాడలో ప్రజా ఆశీర్వద సభకు సీఎం కేసీఆర్ ఆదివారం హాజరుకానున్నారు. కటకొమ్ముగూడెం బైపాస్‌లోని విశాలమైన 25ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలోని సభకు సీఎం కేసీఆర్ హాజరై ప్రజలు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం ఇస్తూ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి శశిధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, ఎన్నికల ఇన్‌చార్జి తక్కెళ్లపల్లి రవీందర్రావులు సభా ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 6మండలాలతో పాటు కోదాడ పట్టణం నుంచి 75 వేలకు పైగా పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా హాజరుకానున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను దగ్గర నుండి చూడాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.